www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వుల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 31 | 09-05-2022 | పుటలు : 4


# నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేద్దాం



## యూనివర్సిటీల వైస్ చాన్సలర్ల సదస్సులో గవర్నర్ బిశ్వభూషణ్

**05.05.22 (మీడియాసెల్)** నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేద్దామని గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ సూచించారు. విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లతో విజయవాడ రాజ్ భవన్ లో గురువారం నిర్వహించిన సదస్సులో గవర్నర్ మాట్లాడారు. నూతన జాతీయ విద్యావిధానం స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువస్తోందన్నారు. ఉన్నత విద్యావ్యవస్థ సంస్థాగత స్వయం ప్రతిపత్తి దిశగా పయనించేందుకు నూతన జాతీయ విద్యావిధానం సహకరిస్తుందని చెప్పారు. అందుకోసం పాఠ్యాంశాల పునరుద్ధరణ, బోధన, మూల్యాంకనం, విద్యార్థుల అనుసరణీయత, ఉత్తమ బోధకుల పాత్ర వంటివి మిళితమై ఉన్నాయన్నారు. ఇంజనీరింగ్ , సంప్రదాయ డిగ్రీ కోర్సుల రీడిజైన్ చేయడానికి చర్యలు తీసుకుంటు న్నట్లు తెలిపారు. నాలుగేళ్ల డిగ్రీ కోర్సు విధానాన్ని ప్రవేశపెట్టి ఒక ఏడాది పరిశోధనలకు కేటాయిస్తున్నట్లు చెప్పారు. తరువాత సదస్సుకు హాజరైన 23 విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లు గవర్నర్ కు నివేదికలు సమర్పించారు. దీనిలో భాగంగా ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రగతి నివేదికను సమర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యాదర్శి పూనం మాలకొండయ్య, విద్యాశాఖ కార్యదర్శి జె.శ్యామలరావు, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ కె.రామమోహనరావు, కార్యదర్శి బి.సుధీర్ ప్రేమకుమార్, ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద్ రెడ్డి, జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కాకినాడ వీసీ డాక్టర్ జి.వి.ఆర్. ప్రసాదరాజు, డాక్టర్ వైఎస్ ఆర్ ఉద్యానవన విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్.టి.జానకిరామ్, కృష్ణా యూనివర్సిటీ మచిలీపట్నం వీసీ ప్రొఫెసర్ డాక్టర్ కె.బి.చంద్రశేఖర్, శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ తిరుపతి వీసీ ఆచార్య.కె.రాజారెడ్డి, అచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ఆచార్య పి రాజశేఖర్ మరియు శ్రీ కృష్ణ దేవరాయ, యోగి వేమన, డాక్టర్ వైఎస్ ఆర్ అర్కిటెక్చర్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్, , రాయలసీమ, విక్రమ సింహపురి, అనంతపురం, విజయనగరం జె.ఎన్.టి.యులు, శ్రీ పద్మావతి మహిళా, ద్రవిడియన్, డాక్టర్ అబ్దుల్ కలామ్ ఉర్దూ, క్లస్టర్, డాక్టర్ ఎన్ టిఆర్, శ్రీ వెంకటేశ్వర పశువైద్య, , అచార్య ఎన్ జి రంగా వ్యవసాయ, అంధ్ర కేసరి, శ్రీ వెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయాల నుండి ఉపకులపతులు పాల్గొన్నారు.

## వర్సిటీలలో నాణ్యత ప్రమాణాలు నెలకొల్పుదాం

### వీసీలతో విద్యాశాఖ మంత్రి బొత్స



యూనివర్సిటీలలో నాణ్యతా ప్రమాణాలు నెలకొల్పేందుకు సమష్టిగా పనిచేయాలని రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. మంగళగిరిలోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో గురువారం రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వీసీలతో ఆయన సమావేశమయ్యారు . యూనివర్సిటీలు స్వయం ప్రతిపత్తిని కాపాడుకుంటూనే ప్రభుత్వంతో పూర్తి సమన్వయంతో పనిచేయాలని సూచించారు . రాష్ట్రంలోని యూనివర్సిటీలన్నీ దేశంలోనే అత్యుత్తమమైనవిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నది సీఎం జగన్ ఆకాంక్ష అని చెప్పారు. ఆ దిశగా వీసీలు పనిచేయాలని కోరారు. ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.హేమచంద్రారెడ్డి, వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మరియు అన్ని విశ్వవిద్యాలయాల ఉపకులపతులు పాల్గొన్నారు.

## నన్నయ విశ్వవిద్యాలయ నివేదికను సమర్పించిన వీసీ జగన్నాథరావు

గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ నేతృత్వంలో రాజ్ భవన్ లో గురువారం ఉపకులపతుల సమావేశంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రగతి నివేదికను సమర్పించారు. దీనికి సంబంధించిన వివరాలు వీసీ జగన్నాథరావు తెలియజేస్తూ జాతీయ విద్యా విధానం 2020 అమలు, ఉన్నత విద్యాసంస్థలలో మల్టీడిసిప్లినరీ ఎడ్యుకేషన్, విశ్వవిద్యాలయాలలో నాణ్యమైన పరిశోధన, పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడం వంటి పలు కీలకాంశాలను చర్చించారన్నారు. జాతీయ విద్యా విధానం 2020లో తెలిపినట్టు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో విద్యతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎ.పి.ఎస్.ఎస్.డి.సి, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్స్ సహకారంతో యూనివర్సిటీ విద్యార్థులకు స్కిల్ బేసిడ్ ప్రోగ్రామ్స్ అందిస్తున్నామన్నారు. బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ లో క్రెడిట్స్ పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. జాతీయ విద్యా విధానంలో సూచించినట్టు వివిధ బ్రాంచ్ ల మధ్య కొత్త కోర్సులను పెట్టేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. నన్నయ విశ్వవిద్యాలయ పరిశోధన నాణ్యతలను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. ఇప్పటికే రిసెర్చ్ ప్రోజెక్ట్ లకు అధ్యాపకులు అప్లై చేసారన్నారు. పరిశోధనలవైపు పయనించే విధంగా "నన్నయ విజ్ఞాన భారతి" ఆన్లైన్ జర్నల్ ను ప్రారంభించామని అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధన పత్రాలు వ్రాస్తున్నారని చెప్పారు. రాష్ట్ర సంస్థలతో పాటు జాతీయ సంస్థలతో కొలాబ్రేషన్ చేసి విద్యా, విజ్ఞాన, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇటీవల కాలంలో సాధించిన ప్రగతి నివేదికను సమర్పించామన్నారు. విశ్వవిద్యాలయానికి ఐ.ఎస్.ఓ, ఎ.ఐ.సి.టి.ఇ. వంటి గుర్తింపులు తీసుకువచ్చామని, ప్రస్తుతం నాక్ సాధనకు ప్రయత్నిస్తున్నామన్నారు. కోవిడ్ కాలంలో నిర్వహించిన ఆన్లైన్ వెబినార్లకు ఆసియ బుక్ ఆఫ్ రికార్డ్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులు వచ్చాయన్నారు. పర్యావరణ అభివృద్ధికి ఇంకుడు గుంతలు త్రవ్వి మొక్కలు నాటడం, సమాజ శ్రేయస్సుకు సైకలాజికల్ కౌన్సిలింగ్ సేవలు, బ్లడ్ డోనార్ హబ్ ఏర్పాటు, నిత్యవసర వస్తువుల పంపిణి వంటి కార్యక్రమాలకు మంచి స్పందన వచ్చిందన్నారు. విశ్వవిద్యాలయా అభివృద్ధి కేంద్ర నుండి ఖేలో ఇండియా నిధులు తీసుకువచ్చామని, రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్ లలో నూతన భవనాలను నిర్మించామని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలియజేసారు.



## ఆన్లైన్ మూల్యాంకనానికి ప్రణాళికలు



ఆన్లైన్ మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న వీసీ జగన్నాథరావు

**07.05.22 (మీడియాసెల్)** తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో వేగంగా పరీక్ష ఫలితాలను అందించేందుకు పరీక్ష పత్రాల ఆన్లైన్ మూల్యాంకనానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఈసీ హాల్ లో శనివారం మెగ్నెటెక్ ఇన్ఫోటెక్ బృందం వారు ఆన్లైన్ డిజిటల్ ఎవాల్యూషన్ ప్రోజెక్టుకు సంబంధించిన డేమోను ప్రదర్శించారు. పరీక్ష పత్రాల మూల్యాంకన ఆన్లైన్ పనితీరును వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ త్వరతగతిన పరీక్షా పత్రాల మూల్యాంకనం చేసి ఫలితాలను అందించేందుకు ఆన్లైన్ మూల్యంకన పద్ధతులను పరిశీలిస్తున్నామన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో ఉమ్మడి గోదావరి జిల్లాల్లో లక్షకు పైగా విద్యార్థులు డిగ్రీ, పీజీ పరీక్షలు వ్రాస్తున్నారని, వారికి త్వరగా ఫలితాలను అందించేందుకు అన్లైన్ మూల్యాంకనం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆన్లైన్ మూల్యాంకనానికి సంబంధించిన విధానాలను పరిశీలిస్తున్నామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, సిఈ ఎస్.లింగారెడ్డి, సిస్టమ్ మేనేజర్ వి.ఎ.ఎం.జ్యోతి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయకుమారి, మెగ్నెటెక్ ఇన్ఫోటెక్ వి.ఆర్.పంతులు తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం



# విశ్వ కవిత

కవిత్వం ఈశ్వరదత్తమైన ప్రతిభాశక్తి. భావావేశం రమణీయమైన అక్షరరూపం దాల్చి సహృదయ రసజ్ఞుల్ని ఆహ్లాద పరుస్తుంది. హృద్యమైన కవనదేవి సాన్నిధ్యంలో ప్రకాశిస్తుంది.ఎద ఎదలో చైతన్యాన్ని రగిలించి మనిషిని మనీషిగా నిలిపే, మనసున ఆర్ద్రత నింపే కవితారస పానాన్ని పాఠకలోకానికి అందించాలని,కవితాగానం చేయాలనే ఆకాంక్ష కలిగిన సాహితీ మిత్రులు కవులు.

చకోర కంఠంలో అమృతంగా జాలువారే వెన్నెల మాధుర్యాన్ని రహస్యంగా వీక్షించే కవులు, కనిపించే ప్రతి దాన్ని కాగితంపై ఆరాటంగా పేర్చుకుంటూ, అందంగా కూర్చుకుంటూ కవిత్వాన్ని కవితా ప్రియులకు అందిస్తారు.

తిలక్ అన్నట్లుగా..'ప్రతి మాటకీ పదును ఉంది.ప్రతి చిత్రణకీ ఔచిత్యం ఉంది'మాటలు పేర్చటం కాదు కదా కవిత్వమంటే.అది అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చేయటమే దానిలక్ష్యం.

కవి వాక్కు తిరుగులేనిది. నిరంకుశమైంది. కవి చేతిలో ఏ వస్తువైనా సర్వాంగ సుందరంగా మారుతుంది.అవును..కవికి భావౌచిత్య భాషా సంపద ఆయుధం.

స్వేద వస్త్రం చుట్టుకున్న శాంతిలో,ఖేద తిమిరం చీల్చుకొచ్చే కాంతిలో కవిత్వం,దైవత్వం,అద్వైతం!!

ఆదినుంచి అంతం దాకా, ఆత్మ నుంచి అనంతం దాకా పరమాత్మ తత్వాన్ని తనలో నిబిడీకృతం చేసుకున్న ప్రకృతి మానవునికి ఆవాసమై జీవికను ఇచ్చింది. నదులు, సముద్రాలు, మహా సాగరాలు, ఆకాశ మార్గాలు, పర్వతాలు దేశాలను, ప్రాంతాలను వేరు చేస్తున్న సరిహద్దులు కావు. సమైక్యం చేయగల మైత్రీ బంధాలు. అవి విశ్వజనీనమైన మానవ జీవితానికి ఆదర్శ భావనలు. ఆ దృష్టితోనే మన పూర్వులు సకల ప్రకృతిని,ప్రపంచాన్ని ఒకే కుటుంబంగా, అఖండంగా, పవిత్రంగా, పరమాత్మ తత్వంగా దర్శించారు. కవి కూడా అద్వైత తత్వాన్ని అలానే దర్శిస్తాడు. కవుల అంతరంగంలోని పరమాంతరంగం కూడా అదే... అద్వైతతత్వం!!

ఏది నీ ఆది?ఏది నీది? అందరి ఆస్తి మట్టే!పథికునిగా ఇది ఓ కవి ప్రశ్న.ఆడెన్ మహాశయుడు 'కవి యాత్రికుడు' (*Poet is a pilgrim*)అంటారు.

టాల్ స్టాయ్ (*How much land man require*) మనిషికి కావలసిన నేల ఎంత?అని అడిగి పూడిస్తే ఆరడుగులు,కాలిస్తే అదీ అవసరం లేదంటారు.

ఆస్తులను కాదు,మనసుల్ని కబ్జా చేయాలి. అందరి గుండెల్లోనూ స్థిరంగా తిష్ఠవేసిన వాడే నిజమైన యశః కాయుడు, నిక్కమైన కీర్తిశేషుడు. ప్రతిభకు పట్టంకట్టాలనే కవులు ఆకాంక్షిస్తారు.అందుకే జీవకణాల పొరల లోతుల్లో నిండిన ఆత్మను బీడుబారిపోయిన కాగితంపై సిరామృతంగా చల్లి అమరత్వాన్ని సిద్ధింపజేస్తారు.

నిన్నటి నుంచి ఇవాల్టిలోకి ఇవాల్టి నుంచి రేపటిలోకి వలసపోతున్న జీవన యానం కవిత్వం. ఆగకుండా సాగిపోయే కాలం నుంచి బ్రతుకు క్షణాల్ని అరువు అడుగుతూ ఆగిపోకుండా కవి నడవాలి. నడుస్తూనే ఉండాలి.

ఎప్పటికీ ఎవరూ వదిలించుకోలేని వర్తమానం కవిత్వానికి ప్రాణం!

కవిత్వం ఊరికినే ప్రచురించేది కాదు. సమాజంలో అంతరికంగా ప్రవహించే ఒక జీవ శక్తి అది.కేవలం లిఖితలిపి కాదు. గుండె గొంతుకలో నుంచి పొంగివచ్చే శబ్దం. ఓ అణచివేత మనలో విప్లవాన్ని, ఓ అందమైన సీనరీ మనలో కోమలత్వాన్ని,ఓ ఎండిపోయిన చెట్టు మనలో దుఃఖాన్ని,ఓ నిశ్శబ్దమైన సెలయేరు మనలో తన్మయత్వాన్ని మనకే తెలియకుండా ఇంజెక్ట్ చేస్తాయి. ఉత్తేజం పొందాలని ఏది మాత్రం కోరుకోదు.పొందకుండా ఊరుకోదు. అడగలేని వాటి

మౌనభాషకు పలకలేని వాటి మూగ భావాలకు కవిత్వమే ఒక అనువాది.

కవిత్వం ఎలా పుడుతుందో, ఎక్కడికి పోతుందో, ఎంతమంది గుండె సామ్రాజ్యాల్లో ఎర్రబావుటా ఎగరేస్తుందో, ఎంతమంది గొంతు వాకిళ్ళలో రాగద్వేషాలు రగిలిస్తుందో, చేతుల నుండి, కళ్ళనుండి, మెదడు నుండి,మళ్లీ చేతులకి కవిత్వమో.... ఎండ్లెస్ వీల్ అండ్ వెర్సటైల్ విల్! అది తొక్కిన ప్రతి వస్తువు కాగితం నుండి నూతనంగా మళ్లీ అంకురిస్తుంది. దాన్ని మళ్ళీ వినూత్నంగా అలంకరిస్తుంది.కవిత్వం గమ్యం కాదు. అదెప్పుడూ ఒక మజిలీ. అనివార్యమైన భావాల ఉప్పెన. దానిని ఆనకట్టతో బంధించలేం. ప్రవాహగమనమే, వలస జీవనమే కవిత్వం. అయితే కవితా ప్రపంచం వేరు.కవి కన్నుతో మనం ఆ లోకాన్ని చూడాలి.కవిత్వం మన కోసం, మంచి కోసం ఎలా ప్రయత్నిస్తూ, ఎలా కృతకృత్యమౌతుందో తెలుస్తుంది.

## మంచి మాట


పుస్తకం చదివితే
లెక్కలేనంత మంది
అనుభవాలను
ఆలోచనలను
తెలియజేస్తుంది



## ప్రతిభా వాణి

### విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్

(7.5.1861 - 7.8.1941)



భారత దేశానికి జాతీయ గీతాన్ని అందించిన కవి, రవీంద్రనాథ్ ఠాగూర్, టాగోర్ గానూ, రవీంద్రుని గాను ప్రసిద్ధుడైన ఆయన తన గీతాంజలి కావ్యానికి సాహిత్యంలో నోబెల్ బహుమతిని అందుకున్నారు. నోబెల్ బహుమతిని అందుకున్న మొట్టమొదటి ఆసియావాసి ఆయనే.

ఠాగూర్ – వేర్ ద మైండ్ ఈజ్.....

ఎక్కడ మనసు నిర్భయంగా ఉంటుందో,
ఎక్కడ మనుషులు తలెత్తి తిరుగుతారో,
ఎక్కడ జ్ఞానం విరివిగా వెలుస్తుందో,
ఎక్కడ ప్రపంచం ముక్కముక్కలై ఇరుకైన
గోడలమధ్య మ్రగ్గిపోవదో,
ఎక్కడ సత్యాంతరాళం లోంచి పలుకులు
బయలు వెడలుతాయో,
ఎక్కడ అలసట నెరుగని శ్రమ తన
బాహువుల్ని పరిపూర్ణత వైపు జాస్తుందో,
ఎక్కడ
నిర్జీవమైన
ఆచారపుటెడారిలో స్వచ్ఛమైన బుద్ధి
ప్రవాహం ఇంకిపోకుండా వుంటుందో,
ఎక్కడ మనసు నిరంతరం వికసించే
భావాలలోకీ, కార్యాలలోకి నీచే
నడపబడుతుందో,
ఆ స్వేచ్ఛా స్వర్గానికి,
తండ్రీ! నా దేశాన్ని మేల్కొలుపు!!

**అనువాదం: చలం**

# నన్నయలో రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి

**07.05.22 (మీడియాసెల్)** ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన నోబెల్ అవార్డును ఆసియాలోనే మొట్టమొదటిసారిగా అందుకున్న దేశం గర్వించదగిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అని ఆచార్య టి.అశోక్ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఈసీ హాల్ లో శనివారం రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ హాజరై ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ భారతదేశానికి జాతీయ గీతాన్ని అందించిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అని కొనియాడారు. గీతాంజలి కావ్యం ద్వారా ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డుల్లో ఒకటైన నోబెల్ అవార్డును సైతం ఆసియాలోనే మొట్టమొదటిసారిగా అందుకున్న ఏకైక వ్యక్తి ఠాగుర్ అని నివాళులర్పించారు. ప్రతి గడిచిన రోజూ మనమేదైనా నేర్చుకున్నదై ఉండాలని,ఎవరైనా సరే నేర్చుకుంటూ ఉంటేనే తప్ప సరిగా బోధించలేరని ఠాగుర్ చెప్పిన వాక్యాలను గుర్తుచేసారు. అసమర్థులకు అవరోధాలుగా కనిపించేవి సమర్థులకు అవకాశాలుగా కనిపిస్తాయని, జీవితంలో వైఫల్యాలు భారమని గ్రహించేవారు, వాటి నుంచి గుణపాఠాలు నేర్చుకోవచ్చునని ఠాగుర్ రచనలు ద్వారా ఎంతో స్ఫూర్తి పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఓ.ఎస్.డి.ఆచార్య ఎస్.టేకి, డా.పి.వెంకటేశ్వరరావు, డా.ఎన్.ఉదయభాస్కర్, ఫైనాన్స్ ఆఫీసర్ సత్యనారాయణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.చంద్రకళ, ఎం.గోపాలకృష్ణ, మనోహర్ పాల్గొన్నారు.



ఠాగుర్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్

# నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులను అభినందించిన వీసీ

**07.05.22 (మీడియాసెల్)** జాతీయ స్థాయి మెన్ అండ్ ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్రీడాకారులు రెండు సిల్వర్ మెడల్స్ సాధించారని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అభినందించారు. శనివారం యూనివర్సిటీలోని వీసీ కార్యాలయంలో క్రీడాకారులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను, పథకాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తరుపున జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పి.ధాత్రి, సిహెచ్ వినయ్ కుమార్ సత్తాచాటి సిల్వర్ మెడల్స్ సాధించారని అభినందించారు. బెంగళూరులో జరిగిన సెకండ్ ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ మెన్ పోటీలలో నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల కె.ఎ మరియు హెచ్.ఎల్ కాలేజ్ ఏలూరు విద్యార్థి సిహెచ్ వినయ్ కుమార్ 89 కేజీల కేటగిరిలో సిల్వర్ మెడల్ సాధించి జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలో రెండో స్థానంలో నిలిచారన్నారు. అలాగే వెయిట్ లిఫ్టింగ్ ఉమెన్ పోటీలలో వి ఎస్ లక్ష్మి ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ కాకినాడ విద్యార్థి పి.ధాత్రి 76కేజీల కేటగిరిలో సిల్వర్ మెడల్ సాధించి రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. నిరుపేద కుటుంబం నుండి వెయిట్ లిఫ్టింగ్ లో రాణిస్తూ, నిరంతరం సాధన చేస్తూ జాతీయ స్థాయి పోటీలలో సత్తాచాటిన క్రీడాకారుల క్రీడా స్ఫూర్తిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. క్రీడాకారులకు సహకరించిన తల్లిదండ్రులను, కోచ్ లను అభినందించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం ప్రాంగణంలో వెయిట్ లిఫ్టింగ్ కు సంబంధించిన శిక్షణ ఇచ్చేందుకు యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ వారు ప్రణాళిక రూపొందించాలన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారిలో ప్రతిభను వెలికితీయడానికి నన్నయ విశ్వవిద్యాలయం వేదిక అవుతుందన్నారు. జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ లో సత్తాచాటిన పి.ధాత్రి, సిహెచ్ వినయ్ కుమార్ లకు విశ్వవిద్యాలయం తరుపున పూర్తి సహాయ సహకారాలను మరియు ప్రోత్సాహాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్ డా.కె.సుబ్బారావు, యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డా.బి.రామ్ గోపాల్, సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ బి.వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.



నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులను అభినందిస్తున్న వీసీ

# కాకినాడ క్యాంపస్‌లో అల్లూరి, ఠాగూర్ జయంతి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కాకినాడలో భారత దేశ మొట్టమొదటి నోబెల్ గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ 161 వ జయంతిని మరియు మన్యం వీరులు అల్లూరి సీతారామరాజు 98 వ వర్ధంతిని సంయుక్తంగా నిర్వహించారు. తొలుత వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు పిదప క్యాంపస్ ప్రిన్సిపల్ డా. ఎం. కమల కుమారి మాట్లాడుతూ రవీంద్రనాథ్ ఠాగూర్ విద్యా వ్యవస్థకి అందించిన కృషిని అలాగే ఆయన రాసిన వివిధ రచనల గురించి వివరించారు. అలాగే భారత స్వతంత్ర సంగ్రామంలో అల్లూరి సీతారామరాజు కనపరిచిన వీరత్వాన్ని, విప్లవాన్ని విద్యార్థులకు విశదీకరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఇంజనీర్ డా. నూకరత్నం, యేసురత్నం ,విజయ,గోపి, శ్రీను బోధన బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# ఎర్రాప్రగడ రామకృష్ణ - గోదావరి గలగలలు



ఎర్రాప్రగడ రామకృష్ణ నాకు పరిచయమై నలభై ఏళ్ళు. నా తొలి యవ్వన కాలంలో రాజమండ్రిలో చిన్న ఉద్యోగం చేసుకుంటూ ఉంటున్న రోజుల్లో, ఆర్.ఎస్. సుదర్శనంగారు నాకు సాహితీవేదిక బృందాన్ని పరిచయం చేసారు. ఆ మిత్రులవల్ల రాజమండ్రి నా విశ్వవిద్యాలయంగా మారిపోయింది. గౌతమీ గ్రంథాలయం, సమాచారం పత్రికా కార్యాలయం, గోదావరి గట్టు వంటివి మా అధ్యయన కేంద్రాలు. ఆ స్నేహాలవల్ల రాజమండ్రిని నేను నా ఉజ్జయిని గా లెక్కపెట్టుకుంటాను. ఇప్పటికీ ఆ ఊరు తలపుకి రాగానే 'మా గోదావరియే, తదీయ తటియే, ఆమ్నాయాంత సంవేద్యుడౌ, మా గౌరీశుడె, మా వేణుగోపాలుడే 'అంటో మా మాష్టారు రాసుకున్న పద్యం నా మదిలో నర్తిస్తుంది. ఒక్కణ్ణే ఒక రూములో ఉంటో, బయట హోటల్లో భోజనం చేస్తో, చాలీచాలని జీతంతో గడిపిన అటువంటి కాలంలో రామకృష్ణ నాకు అన్నగా నిలబడ్డాడు. ఎన్నిరాత్రులో అతడి ఇంట్లో సోదరి పెట్టిన అన్నం తిన్నానో లెక్కపెట్టలేను. నేను రాజమండ్రి వదిలిపెట్టి వెళ్ళిపోతున్నప్పుడు ఒక కవిత రాసాను. అందులో 'సెలవు నువ్వు కలిపి పెట్టిన అన్నం ముద్దలకు, సెలవు నీవు రుచి చూపిన ఆకలి రాత్రులకు ' అని ఒక వాక్యం రాసాను. రాజమండ్రి నాకు కలిపి పెట్టిన అన్నం ముద్దల్లో అధికాంశం అతడి భార్య, అంటే మా సోదరి కలిపి పెట్టిన అన్నం ముద్దలే.

ఆ రోజుల్లో మాకు మరొక జీవితాశయం లేదు. కవి తప్ప మరొకరెవరూ మాకు ఆరాధనీయులుగా కనబడేవారు కారు. సాహిత్యం గురించి మాట్లాడుకోవడమొక్కటే ముఖ్యమైన పనిగానూ, తీరికసమయపు వ్యాపకంగానూ ఉండేది. అట్లాంటి కాలంలో అయిదేళ్ళు అక్కడ గడిపాను. కాని రామకృష్ణ ఇంతకాలం అక్కడే గడిపాడు, గడుపుతూనే ఉన్నాడు. వేదంలా ఘోషించే గోదావర్ని వదిలిపెట్టలేక ఉద్యోగంలో ప్రమోషన్లు వదులుకున్నాడు. ఒక ఋషి దగ్గర ఆయన సేవ చేసుకుంటూ ఉండిపోవడమే తమ జీవిత కర్తవ్యంగా భావించే వాళ్ళుంటారే, అదిగో, రామకృష్ణ అట్లాంటి కోవకి చెందినవాడు. రాజమండ్రి వీథుల్లో తిరుగుతో, పూర్వ, అధునాతన కావ్యాల గురించీ, సాహిత్యకారుల గురించీ మాట్లాడుకుంటూ గడపడం కోసం అతడు తక్కిన జీవితానందాలన్నీ సునాయాసంగా పక్కన పెట్టెయ్యగలిగాడు.

ఇప్పుడు ఈ గోదావరి గలగలలు పుస్తకంలో వ్యాసాలు తిరగేస్తుంటే అన్నిటికన్నా ముందు నా మీద ఆ గోదావరి గాలులు పుష్కలంగా వీచిన అనుభూతి కలిగింది. ఎన్నో సాయంకాలాలు గోదావరి గట్టు మీద కూచుని సాహిత్యచర్చలు చేసుకుంటూ గడిపిన రోజులు గుర్తొచ్చాయి. మల్లంపల్లి శరభయ్యగారూ, సుదర్శనంగారూ, మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారూ, మా మహేశ్, సావిత్రిగారూ, సుబ్రహ్మణ్యం, గోపీ చందులు గుర్తొచ్చారు. నా రాజమండ్రి జ్ఞాపకాలు అంతవరకే. కాని రామకృష్ణ ఆ ఏథెన్సు వీథుల్లో సోక్రటీసు తర్వాత కాలపు తాత్త్వికుల్ని కూడా చూసాడు. పద్యకవితాయుగం నుంచి యెండ్లూరి సుధాకర్ దాకా తెలుగు కవిత్వాన్ని సుసంపన్నం చేసిన ఎందరో కవుల్ని, ఎన్నో సాహిత్యాల్ని చూసాడు. చూడటమే కాదు, తెలుగు నేల నలుమూలలా తన అనుభవాల్నీ, జ్ఞాపకాల్నీ ఎలుగెత్తి చాటాడు. మేము చెయ్యలేని ఈ పని చేసినందుకు, మేము రామకృష్ణకి సదా ఋణపడి ఉండక తప్పదు.

సాహిత్యం చదువుకోవడం దానికదే గొప్ప పురస్కారం. జీవితం నీకివ్వగల గొప్ప బహుమతి. ఇక చదువుకున్న సాహిత్యాన్ని పదే పదే మననం చేసుకోవడం, చదువుకున్న కవుల్ని ఒకరొకర్ని పోల్చి చూసుకోవడం, వారి సారాంశాన్ని తేనెలాగా పోగుచేసి నలుగురి దోసిళ్ళలోనూ ధారపొయ్యడం మామూలు సుకృతం వల్ల లభించే భాగ్యం కాదు. ఈ పుస్తకం అటువంటి సుకృతసంపద. ఈ గోదావరి గలగలలు అతడు ఏదో ఒక రోజులోనో, ఒక వేళప్పుడో విన్నవి కాదు. ఇందులో సుప్రభాత సుగంధాలు ఉన్నాయి. మధ్యందిన అధ్యయనాలు ఉన్నాయి, సాయంకాల సంధ్యావందనాలు ఉన్నాయి. పూర్వాహ్ణ, మధ్యాహ్న, అపరాహ్ణాలు ఏ ఒక్క రోజువో కావు, అవి అతడి జీవితకాలం మొత్తానికి చెందినవనే సూక్ష్మాన్ని మళ్ళా నేను వాచ్యం చెయ్యనక్కరలేదు.



నన్నయ విశ్వవిద్యాలయంలో గోదావరి గలగలలు గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు.


హిందుస్తానీ సంగీతం వినేవాళ్ళకి ఆ సంగీతసౌరభంతో పాటు మరో సంతోషం కూడా అనుభవంలోకి వస్తూ ఉంటుంది. అదేమంటే, ఆ రాగాలకి వేళలూ, ఋతువులూ కూడా ఉంటాయనేది. ఆ రాగాల్లో కొన్ని ప్రాతఃకాలీన రాగాలు, కొన్ని పూర్వాహ్ణ రాగాలు, కొన్ని సాయంకాల రాగాలు, కొన్ని అర్ధరాత్రి రాగాలు. అంతేనా, కొన్ని రాగాలు, జామునుంచి జాముకి కాలం మారేటప్పుడు, ఆ పరివర్తనలోని భావోద్వేగాన్ని ప్రకటించే సంధి ప్రకాశ రాగాలు కూడా.

రామకృష్ణ తాను చదువుకున్న సాహిత్యాల్ని, తనను ప్రభావితం చేసిన భావోద్వేగాల్ని వింగడించుకుంటున్నప్పుడు ఏవి ప్రాతఃకాల రాగాలో, ఏవి సాయంకాల రాగాలో గుర్తుపట్టాడు. అది మరొక సుకృతం. మనుషులు తమ ఆస్తిపాస్తుల్లో ఏవి ఎవరికి చెందాలో లెక్కవేసినట్టు, అతడు తన జీవితకాలంలోని సూనృత ఘడియలకి ఎవరికి ఎంత ఋణపడ్డాడో ఈ పుస్తకంతో లెక్కలు తేల్చేసాడు.

తాను పుట్టిన దేశం, సంస్కృతి, ఆదికవి, కావ్యవాక్కు, రామ శబ్దం, తెలుగు తల్లి, తెలుగు నేల, తన గోదావరి జిల్లా ఇవన్నీ ప్రాతఃస్మరణీయాలు. తెల్లవారి లేచేటప్పుడు అరచేతులు జోడించుకుని, వారికి నమస్కరించుకుని, అప్పుడు నేలమీద కాళ్ళు పెడితే ఆ నడక నడత గా మారుతుందని రామకృష్ణ గుర్తుపట్టాడు.

ఇక రోజువారీ జీవితం మొదలయ్యాక, దైనందిన జీవితపు ఆటుపోట్ల నుంచి చేతులడ్డి కాపు కాచే కవిత్వాలు, ప్రభావాలు మధ్యాహ్న మార్తాండుడి వేడినుంచి సేదతీర్చే చెలమలు, చెలుములు. శ్రీనాథుడి నుండి జాషువా దాకా, దేవీ భాగవతం

## పుస్తకం




నుండి యోగానంద దాకా, ఖజురహో నుండి కల్పవృక్షందాకా ఎందరు కవులు, ఎన్ని కావ్యాలు, ఎన్ని మననీయ కవిత్వచరణాలు! సాయంకాలానికి వచ్చేటప్పటికి కవిత్వంతో పాటు సంగీతమూ, విమర్శతో పాటు తత్త్వశాస్త్రమూ కూడా తన తలపుల్ని రసభరితం చేస్తున్నాయని మనకి అర్థమవుతుంది. వాల్మీకి తో మొదలైన రోజు దినాంతవేళ గురజాడ స్మరణకు చేరుకోవడంలో ఒక 'గురుజాడ 'ఉంది.

ఈ పుస్తకంలోంచి ఎన్నో వాక్యాలకు వాక్యాలు ఇక్కడ ఎత్తి రాయాలని ఉంది. కానీ ఆ ప్రలోభాన్ని కష్టం మీద అణచుకుంటూ, ఒక్క వాక్యం మాత్రం ఇక్కడ ఉల్లేఖించకుండా ఉండలేకపోతున్నాను: 'నవీన నాగరికత అన్ని రంగాల విలువలను సమూలంగా నాశనం చేస్తూ పోతూ ఉంటే, మరోవైపు నుంచి సంజీవినీ పుల్లను ధరించిన సాధువుల హితవచనాలు వాటిని బతికించు కుంటూ వస్తున్నాయి.' ఈ మాటలు రామకృష్ణ రాసిన ఈ వ్యాసాలకు కూడా అన్వయించవచ్చు. కాబట్టి ఇవి కొన్ని పరమసాధు హితవచనాల గురించిన సాధుహితవచనాలు అని చెప్పగలను.



- వాడ్రేవు చిన వీరభద్రుడు

# మేథమెటిక్స్ ఫ్రెషర్స్ పార్టీ..











# బోటని ఫ్రెషర్స్ పార్టీ











ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in